క్లుప్తంగా

అనుబంధ కమిటీల నియామకంపై దృష్టి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌వలి



తెనాలి: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల కమిటీలను త్వరితగతిన ఏర్పాటుచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, గుంటూరు, పల్నాడు జిల్లాల అనుబంధ విభాగాల అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి తెలిపారు. మంగళవారం ఆయన తెనాలి గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయానికి వచ్చారు. పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను కలిశారు. అనుబంధ విభాగాల కమిటీల నియామకంపై శివకుమార్‌తో చర్చించారు. ఇప్పటికే పూర్తి చేసిన కమిటీల జాబితాను శివకుమార్ ఆయనకు అందజేశారు. ఏ రాజకీయ పార్టీకైనా అనుబంధ విభాగాలే పట్టుగొమ్మలని.. ప్రణాళికా బద్ధంగా ఆయా కమిటీల ఏర్పాటుచేసే దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.

హార్వెస్ట్ బైబిల్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

తెనాలి అర్బన్: హార్వెస్ట్ బైబిల్ యూనివర్సిటీ స్నాతకోత్సవాన్ని గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రతినిధి బిషప్ ప్రవీణ్‌వర్మ మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా అనేక మంది బైబిల్‌లో పీహెచ్‌డీ, మాస్టర్ ఆఫ్ డివినిటీ, బ్యాచ్‌లర్ ఆఫ్ డివినిటీ, బ్యాచ్‌లర్ ఆఫ్ థీయాలజీ వంటి కోర్సులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, ఏపీపీ సునీల్, పినపాటి సురేష్‌బాబు, డి.డానియేల్, చక్రవర్తి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లోని వ్యర్థాలను రోజూ తొలగించాలి




తెనాలి అర్బన్: కాలువల్లోని వ్యర్థాలను రోజూ తొలగించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు సూచించారు. 37వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే గంగానమ్మపేటవాసి సోమరౌతు అర్జునరావు తన ఇంట్లో ఏర్పాటు చేసిన హోం కంపోస్టును పరిశీలించి పలు సూచనలు చేశారు. హోం కంపోస్టును అందరూ ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

రైతులు ఉద్యాన పంటలపై ఆసక్తి చూపాలి

ఉద్యానవన శాఖాధికారి ఉప్పాల శ్రీనిత్య

తెనాలి టౌన్: హైబ్రీడ్ కూరగాయల సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపాలని తెనాలి ఉద్యానవన శాఖాధికారి ఉప్పల శ్రీనిత్య పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడారు. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల పరిధిలో జామ, నిమ్మ, సపోటా, టీసీ బనానా, బొప్పాయి, విడి పూల పెంపకం చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల ఈ పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని చెప్పారు. హైబ్రీడ్ కూరగాయల సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.9,600లు ప్రోత్సాహక నగదు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందని వెల్లడించారు. టమాటా, క్యాప్సికం వంటి పంటలను తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల ప్రాంతాలలో వేసుకోవచ్చని సూచించారు. రైతులు ఉద్యాన పంటలపై ఆసక్తి కనబరచాలని ఆమె పేర్కొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి



తెనాలి టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు పరిహారం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రూరల్ మండలం నందివెలుగు గ్రామంలోని సచివాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. వరదల కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకూ రూ.10 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కూచిపూడి వెంకయ్య, షేక్ షబ్బీర్, ఎ.నాగేశ్వరరావు, జి.అంకమరావు, మురికిపూడి మోహనరావు, ఎం.విశ్వనాథ్‌శర్మ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య విభాగానికి అనారోగ్యం!

తెనాలి పురపాలక సంఘంలోని హెల్త్ విభాగం అనారోగ్యానికి గురైంది. విభాగంలో అవినీతి రాజ్యమేలుతుండడంతో పాటు పారిశుద్ధ్య నిర్వాహణకు ఉపయోగించే వాహనాలు అన్నీ పాడైపోతున్నాయి. వాటిని సకాలంలో బాగుచేయించే వెసులుబాటు లేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో పట్టణంలో పారిశుద్ధ్య నిర్వాహణ జటిలంగా మారుతుంది.

- పెరుగుతున్న అవినీతి
- పాడైన పుష్‌కాట్‌లు, వీల్‌బార్‌లు, ట్రాక్టర్‌లు
- పట్టించుకోని అధికారులు
- జటిలంగా మారుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ



రోడ్డు వెంట క్రమేణా పేరుకుపోతున్న వ్యర్థాలు



చక్రాలు విరిగిన వీల్‌బార్

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో 49,480 నివాస గృహాలు ఉన్నాయి. ఇవి కాకుండా 3,500 వ్యాపార దుకాణాలు ఉన్నాయి. పారిశుద్ధ్య నిర్వాహణ కోసం పట్టణాన్ని 9 పారిశుద్ధ్య డివిజన్‌లుగా అధికారులు విభజించారు. వీటిలో 2 డివిజన్‌లను ప్రభుత్వ పారిశుద్ధ్య కార్మికులు నిర్వహిస్తుండగా మిగిలిన 7 డివిజన్‌లను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో చేయిస్తున్నారు. రోజూ 90 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతూ ఉంటుంది. పారిశుద్ధ్య నిర్వాహణ చేసేందుకు 400 మంది కార్మికులు, 40 మంది నగర దీపికలు, 47 మంది శానిటరీ సెక్రటరీలు, నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, నలుగురు హెల్త్ అసిస్టెంట్‌లు ఉన్నారు. వీరి పర్యవేక్షణ బాధ్యతలను ఒక అసిస్టెంట్ కమిషనర్, ఒక హెల్త్ ఆఫీసర్ చూస్తుంటారు.

మూలన పడిన 80 శాతం వాహనాలు..

పట్టణంలో ఉత్పత్తి అయిన తడి, పొడి, హానికర చెత్తలను వేరువేరుగా కార్మికులు సేకరిస్తుంటారు. వీటికోసం పుష్ కాట్‌లు, వీల్ బార్‌లు, ట్రాక్టర్‌లను ఉపయోగిస్తుంటారు. తెనాలిలో ఉన్న 137 పుష్‌కాట్‌లలో 109, 100 వీల్‌బార్‌లో 80 పాడైపోయాయి. వీటి చక్రాలు దెబ్బతినటం, వెల్డింగ్‌లు తుప్పుపట్టి ఊడిపోవటం వల్ల వాటిని నడపడం కష్టసాధ్యంగా మారింది. తెనాలిలో ఉన్న 15 ట్రాక్టర్‌లలో ఒకటి పాడైపోవడంతో గంగానమ్మపేటలోని వెహికల్ షెడ్‌లో దానిని అక్కడున్న మెకానిక్ ఊడదీసి అలాగే వదిలేశారు. నాలుగు ట్రాక్టర్‌లకు మడ్‌గార్‌లు పూర్తిగా దెబ్బతినడంతో వాటిని తొలగించి నామమాత్రంగా ఉపయోగిస్తున్నారు. మిగిలిన వాటితోనే తెనాలిలో చెత్త సేకరణ జరుపుతున్నారు.

అవినీతి ఊబిలో హెల్త్ సెక్షన్..

ఆరోగ్య విభాగం అవినీతి ఊబిలో కూరుకుపోయిందనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇటీవల కార్మికులకు అవసరమైన పరికరాలను (కత్తులు, కొడవళ్లు, దంతులు, కాలువ పారలు వంటివి) కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.6 లక్షలతో కొనుగోలు చేశారు. అవి నాసిరకంగా ఉండడం.. వాటి కర్రలు తరచూ ఊడిపోతుండడంతో కార్మికులు మంత్రి నాదెండ్ల మనోహర్, కమిషనర్‌లకు ఫిర్యాదులు చేశారు. వాటిని కాంట్రాక్టర్‌తో చెప్పి మార్పిస్తామని ప్రకటించి నెలలు దాటుతున్నా నేటికీ అది జరగలేదు. అలాగే కార్మికులకు అవసరమైన పే స్లిప్‌లు, శాలరీ సర్టిఫికెట్‌లు ఇవ్వాలంటే రూ.500 వసూలు చేస్తున్నారనే ఆరోపణ వినిపిస్తున్నాయి. అలాగే ట్రాక్టర్‌లు, కంపాక్టర్‌లు వంటి వాటికి అవసరమైన డీజిల్‌లో కూడ పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నట్లు సమాచారం.

వాహనాలు బాగు చేయించేందుకు చర్యలు..



పారిశుద్ధ్య నిర్వాహణకు ఉపయోగించే పుష్‌కాట్‌లు, వీల్‌బార్‌లు పాడైన మాట వాస్తవమే. కొన్ని ట్రాక్టర్లు రిపేరులో ఉన్నాయి. వీటిని బాగు చేయించాలని మున్సిపల్ ఇంజినీర్‌కు తెలియజేశాము. వారు త్వరలో టెండర్లు పిలచి బాగు చేయించే అవకాశం ఉంది. అలాగే నాసిరకం పరికరాలు మార్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

– డాక్టర్ మువ్వా యేసుబాబు, ఆరోగ్యాధికారి, తెనాలి పురపాలక సంఘం

వరద బాధిత రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్ కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెదకాకాని: వరదలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం పెదకాకానిలో తహసీల్దార్ పి.కృష్ణకాంత్‌కు రైతులతో కలిసి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మండలంలోని రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల పంటలు వేసిన రైతులు నష్టపోయారని, ముఖ్యంగా వరి పంట ఒకటి రెండుసార్లు సుమారు 20 వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వేస్తే అది నీటిపాలైందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి తక్షణమే పంట రుణాలు మంజూరు చేయాలన్నారు.అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు వర్తింప జేయాలన్నారు. ఇటీవల అధిక వర్షాలు వరదల్లో నష్టపోయిన పంటకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పని దినాలు 200 రోజులు పెంచి రోజుకు 600 కనీస వేతనం ఇవ్వాలన్నారు. గుంటూరు చానల్ కొండవీటి వాగు ఇతర పంట కాలవలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయాలని కోరారు. రైతు సేవ కేంద్రాల్లో విత్తనాలు ఎరువులు, పురుగు మందులు, అందుబాటులో ఉంచాలన్నారు. పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్ స్పందిస్తూ తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉల్లంగుల శివయ్య, తన్నీరు సాంబశివరావు, చెన్నం మోహన్, పసుపులేటి రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

నెహ్రూనగర్: వైఎస్సార్ సీపీ నగరపాలక సంస్థ కో–ఆప్షన్ మెంబర్ పూనూరి నాగేశ్వరరావు తల్లి పూనూరి రాములమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. సంజీవయ్యనగర్‌లోని డాక్టర్ పినపాటి ప్రభుదాస్ నగరపాలక సంస్థ పాఠశాలలో విశ్రాంతి డెప్యూటీ కలెక్టర్ గొర్రెపాటి అచ్యుత రావు హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అగ్గిపెట్టే రాజు, తుమ్మేటి శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏడీఈ పూనూరి ఆనందరావు, హైస్కూల్ హెచ్‌ఎం కిషోర్ బాబు, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

లాడ్జిలో అగ్నిప్రమాదం



నెహ్రూనగర్: అరండల్‌పేట 4వలైనులో ఉన్న ఓ ప్రైవేట్ హోటల్(లాడ్జి)లో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని లాడ్జి నిర్వాహకులు చెప్పారు.

మంచి అలవాట్లతోనే సంపూర్ణ ఆరోగ్యం

- వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు
- ఉచిత పోషకాహార ఆరోగ్య పరీక్షలు కౌన్సెలింగ్



కార్యక్రమాన్ని ప్రారంభించిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని(ఏఎన్‌యూ): మంచి ఆరోగ్యకరమైన అలవాట్ల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్, న్యూట్రీషన్ అండ్ డైటిటిక్స్, వ్యాయామ కళాశాల, కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులు ఉచిత పోషకాహార పరీక్షలు, కౌన్సెలింగ్' కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఏఎన్‌యులోని డైక్‌మెన్ ఆడిటోరియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎస్‌ఆర్ డైరెక్టర్, ఫుడ్ సైన్స్, న్యూట్రీషన్ అండ్ డైటిటిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ బి.బబిత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ పోషక ఆహార లోపాలను అధిగమించాలంటే ముఖ్యమైన విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలను ప్రతిరోజు తీసుకోవాలన్నారు. దానితో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉండాలని సూచించారు. ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు అభినందించారు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు సమాజహితం కోసం గ్రామాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతిశ్రీ, డాక్టర్ జలజ కుమారి, సీఎస్‌ఆర్ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.వెంకట రమణ, వ్యాయామ కళాశాల ఆచార్యులు డాక్టర్ కిషోర్, డాక్టర్ రామ్మోహన్ రావు, వికాస అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ప్రసాద్, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది పరీక్షలు చేయించుకున్నారు.

చెత్తకుప్పలు బ్లాక్స్ స్పాట్స్ లేకుండా చూడాలి



పాత్తూరులో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో చెత్త కుప్పలు, బ్లాక్స్ స్పాట్స్ లేకుండా ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు భాధ్యత తీసుకోవాలని, ప్రజలకు కూడా రోడ్ల మీద వ్యర్థాలు వేయకుండా అవగాహన కలిగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం శ్రీనివాసరావు తోట, సాయి నగర్, పాత్తూరు తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ సచివాలయాల వారీగా పారిశుద్ధ్యంపై అధికారులు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్ల మీద చెత్త ఉండడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రతి రోజు ఇంటి వద్దకు చెత్త సేకరణకు వచ్చే సమయంపై అవగాహన కల్గించాలన్నారు. రోడ్ల మీద వేసే వారికి అపరాధ రుసుం విధించాలన్నారు. మధ్యాహ్నం డ్రైన్ కల్వర్ట్‌లు శుభ్రం చేయాలన్నారు. యూజీడి మ్యాన్ హోల్స్ దగ్గర ఓవర్ ఫ్లో కాకుండా ఎప్పటికప్పుడు ఏమినిటి కార్యదర్శులు గమనిస్తూ, సమస్యను గుర్తిస్తే యూజీడి వర్కర్స్ ద్వారా పరిష్కారం చేయాలని ఆదేశించారు. వార్డ్‌ల వారీగా అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పాటించని ప్రాంతాల్లో సంబంధిత అధికారులు, కార్యదర్శులే భాధ్యత వహించాలన్నారు. పీజీఆర్ఎస్‌కి పాత్తూరు నుంచి ఇచ్చిన ఆర్జీలను క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో డ్రైన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం సాయినగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, నిబంధనల మేరకు నిర్మాణాలు జరిగేలా పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులు పర్యవేక్షణ చేయాలని, అనధికార, అక్రమ నిర్మాణాలను తొలిదశలోనే అడ్డుకోవాలన్నారు. పర్యటనలో డీఈఈ వెంకట రమణ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు



కనులపండువుగా నిర్వహిస్తున్న ఊరేగింపు



చిన్నారుల కోలాట ప్రదర్శన

తెనాలి: త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో గత నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక తెనాలి–గుంటూరు ఉత్సవ కమిటీ నిర్వాహణలో స్థానిక పాండురంగపేటలోని శుభం కల్యాణ మండపంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. రోజూ శ్రీకృష్ణునికి పూజా కార్యక్రమాలు, భగవద్గీత శ్లోక పఠనంతో కార్యక్రమాలను నిర్వహించారు. చివరి రోజున మధ్యాహ్నం 2 గంటల నుంచి స్వామివారి ఊరేగింపును సందడిగా జరిపారు. ఊరేగింపులో భాగంగా ఏర్పాటు చేసిన కోలాటం ఆకర్షణీయంగా సాగింది. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి–ఇందూ జ్ఞానవేదిక తెనాలి ఉత్సవ నిర్వాహకులు టీవీ కృష్ణారావు, గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, రొంపిచర్ల రామకృష్ణ, బ్యాంకు శ్రీను, శివలింగం, రామోజీ, హరిబాబు, బ్రహ్మం, పట్టాభి, శ్రీను, గోపి, విద్య, శ్రీదేవి, షేక్ దిల్షా, రేణుకాదేవి తదితరులతో పాటు చిలకలూరిపేట, పిడుగురాళ్ల, భీమవరం, నూజివీడు నుంచి భక్తులు పాల్గొన్నారు.

స్వామిత్వ పథకంతో భూ తగాదాలకు చెక్



సమావేశంలో మాట్లాడుతున్న దీప్తి

తెనాలి టౌన్: స్వామిత్వ పథకంతో భూ తగాదాలకు శాశ్వత పరిష్కారం చూపవచ్చని ఎంపీడీవో అత్తోట దీప్తి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, సర్వేయర్లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ.ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్వామిత్వ పథకం ఫేజ్–2లో భాగంగా తెనాలి మండలాన్ని ఈ స్కీమ్ కింద ఎంపిక చేసినట్లు చెప్పారు. డ్రోన్ సర్వే ద్వారా గ్రామంలోని ఇల్లు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ, అసైన్డ్ భూములు, గ్రామకంఠాలు గుర్తించి స్వామిత్వ స్కీమ్‌లోని ప్రోపర్టీ పార్శిల్ మ్యాప్స్ ప్రకారం గ్రౌండింగ్ చేయవచ్చని తెలిపారు. ఈ ప్రోగ్రామ్ చేయడం వల్ల పంచాయతీ పరిధిలోని ఇళ్లకు సంబంధించిన కచ్చితమైన స్థలం, హద్దులు గుర్తించవచ్చని వివరించారు. తద్వారా భూ తగాదాలకు చెక్ పెట్టవచ్చని తెలిపారు. మండల పరిధిలో 7 గ్రామాలకు ఎంపిక చేశామని.. బుధవారం నుంచి నిర్దేశించిన టీమ్‌లు, ఆయా గ్రామాల్లో పని చేస్తాయని వివరించారు. సమావేశంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిలాటెలీ స్కాలర్‌షిప్

సెప్టెంబరు 16 చివరి తేదీ

తెనాలి: ఫిలాటెలీని హాబీగా చేస్తున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి తపాలా శాఖ 'దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన' పథకం కింద ఏడాది పాటు స్కాలర్‌షిప్‌ను ఇవ్వనుందని.. ఆసక్తి కలిగిన వారు సెప్టెంబరు 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 6 నుంచి 9 తరగతుల మధ్య మంచి అకడమిక్ రికార్డు కలిగి ఫిలాటెలీని హాబీగా చేస్తున్న విద్యార్థులు తపాలా సర్కిల్ నిర్వహించే క్విజ్, ఫిలాటెలీ ప్రాజెక్టు ఆధారంగా ఒక ఏడాదికి రూ.6 వేల స్కాలర్‌షిప్ పొందవచ్చని తెలిపారు. విద్యార్థి చదివే పాఠశాలలో ఫిలాటెలీ క్లబ్ ఉండాలనీ.. లేదా సొంత ఫిలాటెలీ డిపాజిట్ అకౌంట్ కలిగి ఉండాలని ఆయన సూచించారు. తొలుత క్విజ్ పోటీ, తర్వాత ప్రాజెక్టు పోటీ అనంతరం స్కాలర్‌షిప్‌నకు ఎంపిక చేస్తారు. మరిన్ని వివరాలకు దగ్గర్లోని పోస్టాఫీసును సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఓట్ల చోరీ.. ఈసీ–బీజేపీ కుట్రలను గమనిస్తున్న ప్రజలు



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్, వామపక్ష నాయకులు

తెనాలి టౌన్: దేశంలో జరుగుతున్న ఓట్ల దొంగతనాన్ని, ఈసీ–బీజేపీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. 'ఓట్ల దొంగతనం ఆపాలి.. నరేంద్ర మోదీని గద్దె దింపాలి' అనే నినాదంతో మంగళవారం స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీలు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని సాంబశివుడు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఓట్ల చోరీని బయటపెట్టాక, ఎలక్షన్ కమిషనర్‌కు దిక్కుతోచడం లేదని ఆరోపించారు. ఈసీ వెబ్‌సైట్ నుంచి తీసుకున్న డేటాతోనే ఓట్ల చోరీని బయట పెట్టినట్లు ఆయన తెలిపారు. ప్రధాని మోదీ ప్రమాదకరమైన వ్యక్తి అని ఆయన పేర్కొన్నారు. మోదీ పాలనలో యథేచ్ఛగా ఓట్ల చోరి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పి.నాగసూర్యశశిధరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎం.కిరణ్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్, సీపీఎం ఏరియా కార్యదర్శి కె.బాబుప్రసాద్, నాయకులు భీమా రమేష్, ద్వారక శ్రీనివాస్, మల్లవరపు ప్రసాద్, దండు శివ, ఎం.పూర్ణచంద్రరావు, పి.ప్రభాకర్, కె.కోటేశ్వరరావు, బి.రమేష్, సీహెచ్.అయ్యప్ప, మల్లికార్జున, పెనుగొండ శివకుమార్, డి.శ్రీను, పోలే రాము, అనిల్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సేవలు అభినందనీయం



లూయిస్ జాక్వెస్ మాండే డాగ్యురే చిత్రపటానికి నివాళులు



సత్కారగ్రహీతలతో రోటరీ బాధ్యులు

తెనాలి అర్బన్: ఫొటో, వీడియోగ్రాఫర్ల సేవలు అభినందనీయమని తెనాలి తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని వీడియోగ్రాఫర్ అండ్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో మంగళవారం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాక్వెస్ మాండే డాగ్యురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుద్దపల్లి సాంబశివరావు, కార్యదర్శి వి.మణికంఠ, కోశాధికారి సీహెచ్.శేఖర్, నాయకులు మహేష్, సుబ్రహ్మణ్యం, రాంబాబు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్ ఉప్పలపాటి రామును ప్రకాశం రోడ్డులో ఘనంగా సన్మానించారు. అనంతరం క్లబ్ సభ్యుడు లయన్ పాదర్తి వెంకటేశ్వరరావు సహకారంతో ఆయనకు రూ.8,500 నగదు అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లయన్ నేరెళ్ల వెంకటకృష్ణమోహనరావు, వ్యవస్థాపకుడు లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్యం, నాయకులు డాక్టర్ కడియాల పల్లవి, అయినాల మల్లేశ్వరరావు, కికురి చిన్న కృష్ణారెడ్డి, కోణిజేటి రమేష్‌కృష్ణ, నంబూరు శ్రీకుమార్, తుమ్మల దీపక్, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ కార్యాలయంలో..

తెనాలి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో నిర్వహించారు. రోటరీ క్లబ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. తెనాలికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్లు కోకటి నాగేశ్వరరావు, బిరుదురాజు విజయరాజు, కన్నెగంటి మధు, తుల్లిమిల్లి చంటిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సత్కార గ్రహీతల సేవలను అభినందించారు. క్లబ్ కార్యదర్శి గుమ్మడి వెంకట నారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, కన్నెగంటి మురళీకృష్ణ, అర్జునరావు, డాక్టర్ డి.జీవనలత, ఎంఎల్ జగదీశ్వరాంబ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుంటే ప్రత్యక్ష ఆందోళన

గుంటూరు ఎడ్యుకేషన్: దుగ్గిరాల మండలంలో ఉప ఖజానాధికారి(ఎస్టీవో) వైఖరి కారణంగా ఉపాధ్యాయులకు నిలిచిన వేతనాల చెల్లింపునకు చర్యలు తీసుకోని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానాధికారి కార్యాలయంలో డీటీఓకు వినతి పత్రం సమర్పించారు. పెదబాబు మాట్లాడుతూ ఇటీవల బదిలీల ప్రక్రియలో భాగంగా స్థాన చలనం పొందిన ఉపాధ్యాయులకు జూన్‌కు సంబంధించిన వేతనాలు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్టీవోలందరూ చెల్లింపులు జరిపారని తెలిపారు. అయితే దుగ్గిరాల మండలంలో బదిలీలు కాని ఉపాధ్యాయులను బదిలీల సమాచారం అందలేదనే సాకుతో అక్కడి ఎస్టీఓ వేతనాలు చెల్లించలేదన్నారు. ఇదమేని అడిగితే ఎస్టీఓ కక్ష్య పూరితంగా వ్యవహరిస్తున్నారని డీటీవో దృష్టికి తెచ్చారు. గత 20 ఏళ్లుగా ఉన్న హెచ్‌ఆర్‌ఏ వర్తించదని, అదనంగా తీసుకున్న హెచ్‌ఆర్‌ఏను తిరిగి చెల్లించాలని ఉపాధ్యాయులకు నోటీసులు పంపారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు జీతభత్యాలు చెల్లించాలని కోరితే ఇటువంటి నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణమే నోటీసులను ఉపసంహరించుకోని పక్షంలో దుగ్గిరాల ఉప ఖజానా కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.